# పరిస్థితులూ-ప్రభావాలూ!

మానవుడు పరిస్థితుల వారసుడు. పరిస్థితుల గాలిపాటుకు బానిస. గాలిలో గడ్డిపూచవలె తేలిపోతూ వుంటాడు. ఈ సత్యాన్ని చెంగయ్య నాయుడు ఒప్పుకోడు. అది అసమర్థులూ, అప్రయోజకులూ ఆర్థిక దిగ్బంధంలో ఆవురావురు మంటున్న వాళ్ళూ తమ బలహీనతనూ, అసమర్థతనూ, అప్రయోజకత్వాన్నీ కప్పిపుచ్చుకొనేందుకు, తమను తాము వంచించుకోవడమే తప్ప అందులో నిజంలేదు. మానవుడు పరిస్థితుల్ని తనకి అనుగుణంగా మార్చుకొని, జీవితంలో ముందంజ వేయగల శక్తి మానవునికున్నది. అది అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కాని తనలాంటివారికి అసాధ్యంకాదు. చెంగయ్య నాయుడు ఆ తరహాకు చెందిన మనిషి.

ఆ ఊళ్ళో చెంగయ్య నాయుడు చెప్పుకోదగ్గ షావుకారు. ధనిక వర్గానికి వుండే అన్ని లక్షణాలూ ఆయనలో మూర్తీభవించి ఉన్నాయి. ఆజాను బాహువులు కలిగిన ఆరడుగుల మంచి విగ్రహం. పాముబుట్టలాంటి తలపాగా, కుచ్చు మీసాలు, బంగారపు పన్ను వేసిన గంధపు చేతికర్రా, మల్లెపువ్వులాంటి పెద్దాపురం లాల్చీ పైన బిళ్ళమడత సిల్కు ఉత్తరీయమూ, ఫిన్లేగ్లాస్కో ధోవతీ, గంభీరమైన చిరునవ్వూ, ఆయన హోదానూ, దర్జానూ, వంశ సాంప్రదాయాన్నీ, మనస్తత్వాన్నీ పోషిస్తూ ఉంటాయి. ఆయన హయాములోనే స్వయంగా మూడంతస్థుల మేడ కట్టించాడు; పందెపు కోడెల్ని మేపుతూ సువర్ణ పతకాల్ని బహుమతులుగా పొందాడు.

మూడుసార్లు ఏకగ్రీవంగా పంచాయతీబోర్డుకు ప్రసిడెంటుగా ఎన్నికై, గ్రామాన్ని రాజసంగా పాలించాడు. మందీ మార్బలమూ గల వ్యక్తి. ఊళ్ళో ఎవ్వరినీ లక్ష్యపెట్టడు. ఏ రాజకీయ పార్టీతోనూ జోక్యంలేదు. పూర్వం జస్టీసు పార్టీపైన అభిమానముండేదట. తనకి తానే అతీతుడు. అహంకారం మెండు. ప్రజాస్వామ్యంలో నమ్మకంలేదు. 'డబ్బుగల వాడే ఈ ప్రపంచపు తీరుకు పట్టుగొమ్మ. డబ్బుగలవాడిని ఏ పరిస్థితులైనా ఏమీ చేయలేవు. పర్వతాన్ని ఎంతపెద్ద గాలులైనా కదిలించగలవా?' అన్నది ఆయన అభిప్రాయం.

చెంగయ్య నాయుడు ఇప్పుడావూరి పంచాయితీబోర్డు ప్రెసిడెంటు కాదు. గత రెండు సార్లుగా ఆయన పోటీ చేయలేదు. తనని ఏకగ్రీవంగా ప్రజలు ఎన్నుకుంటారన్న విశ్వాసం పోవడంతో, ఆ పదవికోసం ఆయన ప్రాకులాడలేదు. పదవులకోసం డబ్బును బావిలోని ఉప్పునీటివలె వాడే వాళ్ళంటే ఆయనకు గిట్టదు. పదవుల్లోవుండి డబ్బు చేసుకొనేవాళ్లంటే మళ్ళీ ద్వేషంలేదు. ఏ రాజకీయ పార్టీకీ రాగి పైసా చందా ఇవ్వడు. ఆమాటకొస్తే దాతృత్వగుణం ఆయనలో మృగ్యం. ఎవ్వరు ఎట్లాంటి హీనపరిస్థితుల్లో, కష్టదశలో ఆర్థిక సహాయంకోసం అరిచేతులు చాచుకు వచ్చినా అరపైసా 'ఇంద తీసుకో' అని హృదయపూర్వకంగా ఇవ్వడు. పైపెచ్చు నల్లేరుతో నలుగు పెట్టినట్లుగా మాట్లాడుతాడు.

ఒకరోజు మధ్యాహ్నం మండుటెండలో ఆశను ఆయాసంగా మార్చుకొని ఆర్థిక సహాయం కోసం షావుకారు చెంగయ్య నాయుడు దగ్గర కొచ్చాడు మర్రిచెట్టు ఊడల్లాంటి సంసారంగల శంకరశాస్త్రి. నాయుడూ, శాస్త్రి చిన్ననాటి స్నేహితులు. కాని వారి స్నేహం పెద్దయాక పరిచయస్థులుగా మారిందిగానీ గోరంత గట్టిపడలేదు. అందుకు కారణం నాయుడు స్నేహంలో ఆత్మీయతకూ, నిర్మలత్వానికీ, నిజాయతీకీ ప్రాముఖ్యత నివ్వకుండా సమానహోదాకూ, భోగభాగ్యాలకూ, సాంఘిక, ఆర్థిక విలువలకూ గౌరవాన్నివ్వడమే. ఏమైనా శాస్త్రిని ఆప్యాయంగా ఆహ్వానించి కుర్చీలో కూర్చుండబెట్టి, కుశల ప్రశ్నలు వేసి "ఏంపనిమీద వొచ్చావ్?" అన్నాడు. నిర్మొగమాటంగా చూశాడు నాయుడు.

తన బ్రతుకు చుట్టూ ఆర్థికమైన ఇబ్బందులు ఎట్లా ముళ్ళకంచెల్ని నిలబెట్టిందీ సవిస్తరంగా వివరించాడు శంకరశాస్త్రి. బీదవాళ్ళ అరుపులన్నా, బీదవాళ్ళను గురించి వినటమన్నా చెంగయ్య నాయుడికి మహా చెడ్డ శిరోభారం. మాడుటన్నుల రోడ్డురోలరును మోస్తున్నట్లే ఉంటుంది. అయినప్పటికీ ఓపిగ్గా విన్నాడు.

అయిదుగురు ఆడపిల్లలూ, నలుగురు మగపిల్లలు గల భారీ సంసారం. మీకు తెలియనిదేముంది ? పౌరోహిత్యం చేసుకుంటూ, తిథి వార నక్షత్రాలు చెప్పుకుంటూ సంసార శకటాన్ని అతి కష్టంమీద దొర్లించుకొస్తున్నాను. పరిస్థితులు కుట్రపన్ని నామీద యుద్ధం ప్రకటించాయి. నేను నిలబడాలంటే మీలాంటివారి సహాయం ఎంతైనా కావాలి. మా ఇంటిదానికి కడుపులో వ్రణం. చిక్కి సగమై, గోగుపుల్లలాగా వ్రేలాడుతూ మరణానికి రడీగా ఉంది. ఆపరేషన్ చేయించాలి. కాని చేతిలో చిల్లిగవ్వలేదు. మా రెండో అల్లుడు మా అమ్మాయిని మూడు నెలల క్రితం పుట్టింటికి తన్ని తరిమాడు; పెళ్ళినాటి కట్నం తాలూకు మూడొందలు తీసుకొని రమ్మనమని. మూడొందలు దానికిస్తేనేగానీ దాని కాపురం మళ్ళా చిగురుపట్టదు. గుంటూరులో పాలీటెక్నిక్ కోర్సు చదువుతూన్న మా పెద్దబ్బాయి నాలుగురోజుల క్రితం ఇంటికొచ్చాడు. ఒక టరమ్ జీతం కట్టకపోతే పేరు తొలిగించారంట. కారు మబ్బులు కమ్మిన నా బ్రతుకులో వెలుగు తొంగిచూడాలంటే మీ సహాయం కావాలి. అందుకే కొండంత ఆశతో వచ్చాను."

శంకరశాస్త్రి చాలా మంచివాడు. నీతికి నిటారుగా నిలబడగల మనిషి. ఆత్మగౌరవం పట్ల పట్టుదల గల వ్యక్తి. కాని దారిద్ర్యం ఆయన వ్యక్తిత్వాన్నీ, మంచితనాన్నీ, ఆత్మ గౌరవాభిలాషనూ, ఎక్కిరానివ్వడంలేదు. అది ఆయన వక్రించిన కర్మలోపంగానీ యోగ్యతాలోపం కాదు. ఆ విషయం చెంగయ్య నాయుడుకు తెలుసు. అయినా శంకరశాస్త్రిమీద ఆయనకు జాలీ, సానుభూతి ద్రవించలేదు. ముఖం బెల్లంకొట్టిన రాయిలాగ నిర్లిప్తతను ప్రకటిస్తూ ఉంది.

"నీకుగల ఆర్థిక ఇబ్బందుల జాబితాను నువ్వు చదివావు. నేను కాదనను. నీ బ్రతుకుపై పొంచివున్న కారుమబ్బులు తొలగిపోవాలంటే అత్యవసరంగా నీకు ధనసహాయం కావాలి. అదీనిజమే! నీకు స్థిర చరాస్తులు అట్టేలేవు. డబ్బును నువ్వు సంపాదించలేవు. నేను ఏ వెయ్యిరూపాయలో యిచ్చి నిన్ను ఆదుకున్నాననుకో, మళ్ళీ ఆడబ్బు నువ్వు ఎట్లా ఇచ్చుకోగలుగుతావు? అసంభవం. నాది దానధర్మాలుచేసే మన స్తత్వం కాదని నీకు తెలుసు. అయినా నాదగ్గరకు ఎందుకొచ్చావో నాకర్థం కావడం లేదు, దక్షిణపు దిక్కుకు తిరిగి దణ్ణం పెట్టడంకంటె ఈ పరిస్థితుల్లో నువ్వేం చేయగలవు ? ఆర్థిక పుష్టిగల మానవుడే ఎట్లాంటి పరిస్థితుల్నిగూడా ఎదుర్కొని ముందుకు పోగలడు'' అన్నాడు చెంగయ్య నాయుడు కాలుమీద కాలువేసుక కూర్చొని.

అభిమానంతో శంకరశాస్త్రి మొహం తెల్లటి నెత్తురుతో పాలిపోగా, ఇంటికి వచ్చాడు.

తర్వాత కొద్దిరోజులకే—

శంకరశాస్త్రిభార్య కడుపులో వ్రణానికి ఆపరేషను లేకుండానే కన్నుమూసింది.

ఆయనపెద్దకొడుకు మళ్లీ గుంటూరు పాలీటెక్నిక్ కాలేజీకి వెళ్ళలేదు.

రెండోకూతుర్ని భర్త మళ్లీ తీసుకెళ్ళలేదు. పుట్టింటిలోనే గంజి త్రాగుతూ బ్రతుకును వెళ్ళమారుస్తోంది క్షణమొక యుగంగా.

ఈ విషయాలు తెలిసి ఓరోజు నిండుగా నవ్వుకున్నాడు చెంగయ్య నాయుడు. పరిస్థితులకు బానిసలైనవారి కథలూ, బాధలూ, గాథలూ వినటం ఆయన కెంతో సరదా, సంతృప్తి, ముఖ్యంగా డబ్బులేని వాళ్ళను గురించి.

*　　　*　　　*

ఓరోజు సూర్యుడు పశ్చిమ దిక్కున ఎర్రగా నవ్వుతూ నిష్క్రమిస్తూండగా, షావుకారు చెంగయ్య నాయుడు అరటితోట దగ్గర్నుంచి కారు డ్రైవ్ చేస్తూ ఇంటికి వస్తున్నాడు.

ఊరి మొగదల్లో ధర్మసత్రం దగ్గర పదిమంది పిల్లలు రోడ్డుమీద నీటిగీతలు గీచి 'చెర్‌పట్టి' ఆడుతున్నారు. ఆ ఆటలో వాళ్ళు వొళ్ళుమరచి ఉన్నారు. చెంగయ్య నాయుడు ఫర్లాంగు దూరంనుంచి హారన్ మ్రోగిస్తూనే వస్తున్నాడు. తీరా కారు దగ్గరికి వచ్చేసరికి పిల్లలు ఆదరాబాదరా తప్పుకోవటానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో ఓ ఆరేళ్ళపిల్లవాడు విఫలుడై కారు ముందు చక్రంక్రింద దారుణంగా పడ్డాడు. అక్కడికక్కడే తల నాలుగు ముక్కలుగా పగిలి, మెదడు వెలుపలికొచ్చి నెత్తురు ప్రవహించి మంచినీళ్ళుకూడా అడక్కుండా మరణించాడు.

సత్రం అరుగుమీద పురాణ శ్రవణంలోఉన్న పదిమందీ ఆ ఘోరమైన దృశ్యాన్ని చూసి పరుగెత్తుకొచ్చారు. సత్రం అరుగుమీద పురాణం చెబుతున్న శంకరశాస్త్రికూడా ఆదుర్దాకొద్దీ పరుగెత్తుకొచ్చాడు.

నెత్తురు ముద్దలా పడివున్న పిల్లవాడ్ని చూసి శంకరశాస్త్రి బావురుమన్నాడు. ఆయన చిన్నకొడుకే కారుక్రింద పడింది.

ఆరోడ్డున సైకిలుమీద పోతున్న సబ్‌ఇనస్పెక్టరు జనం గుమిగూడి వుంటాన్నిచూసి గబుక్కున సైకిలు దిగాడు.

చెట్టంత మనిషి చెంగయ్య నాయుడికి కాలూ చేయీ ఆడలేదు. చెమటతో తొడుక్కున్న పెద్దాపురం సిల్కులాల్చీ వానజల్లుకు తడిసినట్లయింది.

ప్యాంటు జేబులోనుంచి నోట్‌బుక్‌తీసి గబగబా ఏదో వ్రాసుకున్నాడు సబ్‌ఇనస్పెక్టరు. కానిస్టేబుల్స్‌ను కబురుచేశాడు. శవాన్ని పోస్టుమార్టమ్‌కు గవర్నమెంటు హాస్పిటల్‌కు పంపించాలన్నాడు.

చెంగయ్య నాయుడు జనంలోంచి దూసుకొని చకచకా ఇంటికి వెళ్ళాడు, కారు అక్కడే వొదిలేసి.

ఇనుప భోషాణం తెరిచి, వందరూపాయల కట్టల్ని చేతిసంచిలో కుక్కుకున్నాడు. ఈ విషమ పరిస్థితిలో బయటపడాలంటే డబ్బుకు ంచిన సాధనం మరొకటిలేదు.

వాకట్లోనే ఎదురైనాడు పోలీసు సబ్ ఇనస్పెక్టరు చెంగయ్యనాయుడ్ని ఆరెస్టు చేయటానికి వొచ్చి.

చెంగయ్యనాయుడు ఐదువేల రూపాయలు సబ్ ఇనస్పెక్టరు చేతిలో పెట్టి "మీరే నన్ను రక్షించాలి ఈ అపాయంనుంచి" అన్నాడు బొంగురుబోయిన గొంతుకతో.

"నాదేముంది? పిల్లవాని తండ్రిని ఒప్పించండి కేసు పెట్టకుండా" అన్నాడు సబ్ ఇనస్పెక్టరు నాలుకపై తడిపెరగగా.

చెంగయ్యనాయుడు పరుగెత్తుకెళ్ళాడు శంకరశాస్త్రి దగ్గరకు ఒక వంద రూపాయల కట్ట ఆయనముందు పెట్టాడు.

"శాస్త్రీ ఈ దుస్థితినుంచి నన్ను కాపాడు. ఈ డబ్బు నీ కెందుకైనా అక్కరకొస్తుంది. కావాలంటే నష్టపరిహారం క్రింద అయిదెకరాల శేరీ మాగాణికూడా వ్రాసిస్తాను."

అంత దుఃఖంలోనూ శంకరశాస్త్రి గంభీరంగా చిరునవ్వు నవ్వాడు.

"నా కొడుకు మరణానికి ఖరీదు కడుతున్నారా! ఈ డబ్బూ, పొలమూ మావాడిని బ్రతికించగలవా?"

చెంగయ్యనాయుడి మొహం చమురులేని దీపమైంది. కాళ్లు నేల మీద నిలువలేదు. గుండెలో భయం గుప్పెట తెరిచింది.

"నేరం నేరమే. నేరాన్ని తుడిచివేయగల శక్తి డబ్బుకులేదు. డబ్బుతో పరిస్థితుల్ని సానుకూలపరుచుకోగల శక్తి అన్నిచోట్లా, అందరి విషయంలోనూ అక్కరకొస్తుందని భ్రమించటం పొరబాటు" అన్నాడు శంకరశాస్త్రి సాగర గంభీర స్వరంతో.

(జ్వాల)

కథా నిలయం
3887
—0—
శ్రీకాకుళం